# ఇంటర్ ఫలితాల్లో మహాత్మా జ్యోతి రావు పూలే

# నర్సాపూర్ కాలేజీ విద్యార్థుల ప్రభంజనం

**తూప్రాన్, ఏప్రిల్ 13. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**




మెదక్ జిల్లా తూప్రాన్ మండలం రావెల్లి లోని నర్సాపూర్ మహాత్మా జ్యోతి రావు పూలే జూనియర్ కళాశాల విద్యార్థులు 2025--2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణ కలిసివస్తే విజయాలు సునాయాసమవుతాయని ఈ విద్యార్థులు మరోసారి నిరూపించారు. ఇంటర్ మొదటి మరియు ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఈ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి "ప్రభంజనం" సృష్టించారు. ద్వితీయ సంవత్సరం వీూజ విభాగంలో పి. మౌనిక 979/1000 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, ఎల్. మానస 974/1000 మార్కులు సాధించింది. దీఫూజ విభాగంలో జి. సత్య సువార్త 977/1000 మార్కులతో మెరిసి, ఎం. హరిప్రియ 972/1000 మార్కులతో ప్రతిభ చాటింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో కూడా అదే ఉత్సాహం కొనసాగింది. వీూజ విభాగంలో బి. వైష్ణవి 464/470 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, ఎం. మల్లేశ్వరి 461/470 మార్కులు సాధించింది. దీఫూజ విభాగంలో బి. సహర్ష 435/440, సిహెచ్. సుమత 432/440 మార్కులు సాధించి ప్రతిభను చాటారు. ఈ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం కూడా గణనీయంగా ఉంది. ద్వితీయ సంవత్సరం వీూజలో 92% ఉత్తీర్ణత నమోదవగా, దీఫూజలో 100% ఉత్తీర్ణత సాధించడం విశేషం. మొదటి సంవత్సరం వీూజలో 89%, దీఫూజలో 97% ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం మీద మొదటి సంవత్సరం ఉత్తీర్ణత శాతం 94%, ద్వితీయ సంవత్సరం 96% కాగా, మొత్తం కళాశాల ఉత్తీర్ణత శాతం 95%గా నమోదైంది. ప్రత్యేకంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులు కూడా ప్రతిభలో ముందుండి రాష్ట్ర స్థాయిలో రాణించడం గమనార్హం. "పేరు వెనుకబడిన తరగతులదైనా, ప్రతిభలో ముందున్నాం" అని విద్యార్థులు గర్వంగా చెబుతున్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ జి. రాజమణి మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లిదండ్రుల సహకారం కలిసివచ్చిన ఫలితమే ఈ విజయమని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు కళాశాల తరపున ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థుల విజయంపై తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ ఫలితాలు నర్సాపూర్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఇలా మహాత్మా జ్యోతి రావు పూలే జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభతో కొత్త ప్రమాణాలు నెలకొల్పి, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు.

# "అరివ్ అలైవ్ – 4వ దశ" కార్యక్రమం

## మల్కాపూర్ గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన గ్రామ సభ

**తూప్రాన్, ఏప్రిల్ 13 (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి):**

"ఆర్రివ్ అలైవ్ -- 4వ దశ" కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సహకారంతో గ్రామ రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తూప్రాన్ సీఐ శ్రీ రంగ కృష్ణ, ఎస్ఐ శ్రీ వి. గంగరాజు, వి.పి.ఓ, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌తో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సభలో అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగంపై వివరంగా అవగాహన కల్పించారు. అదనంగా గ్రామంలోని ప్రధాన రహదారులను పరిశీలించి ప్రమాదాలకు కారణమయ్యే గుంతలను గుర్తించి మట్టితో పూడ్చారు. రోడ్డు పక్కన పెరిగిన పొదలు, చెట్ల కొమ్మలను తొలగించి వాహనదారులకు స్పష్టమైన దృశ్యం కల్పించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్తులకు రోడ్డు భద్రతపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తూ రోడ్డు భద్రత చర్యల్లో భాగస్వాములు అవుతామని హామీ ఇచ్చారు.




# ఏక భారత్ స్ఫూర్తి

**-నూతన సంవత్సర పర్వదినాల్లో ఐక్యత సందేశం-ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు**

**-సంస్కృతి, సంప్రదాయాల సమన్వయానికి పిలుపు**






**న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరుపుకునే సంప్రదాయ నూతన సంవత్సర పర్వదినాల సందర్భంగా భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ దేశ, విదేశాల్లోని భారతీయులందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బైశాఖి, రొంగాలి బిహు, మహా బిషుబ పాన సంక్రాంతి, పొయిలా బైశాఖ్, విషు, తమిళ పుత్తాండు వంటి పండుగలు 'ఏక భారత్ -- శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పండుగలు దేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని మాత్రమే కాకుండా అంతర్లీనంగా ఉన్న ఐక్యతను కూడా చాటుతున్నాయని తెలిపారు. ప్రతి ప్రాంతం ప్రత్యేకతను నిలబెట్టుకుంటూనే, భారతీయ సంస్కృతికి చెందిన ఉమ్మడి మూలాలను గుర్తు చేస్తున్నాయని చెప్పారు. చిత్తిరై మాసం ప్రారంభంతో రైతులు వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతారని, భూమిని సారవంతం చేసే ప్రక్రియలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. "కష్టే ఫలి" అనే భావన భారతీయుల జీవన విధానంలో కీలకమని, అందుకే వ్యవసాయ ఆరంభాన్ని పండుగగా జరుపుకుంటారని వివరించారు. ఉత్తర భారతదేశంలో పంజాబ్ ప్రజలు బైశాఖిని వ్యవసాయ పండుగగా జరుపుకుంటే, దక్షిణాదిలో కేరళలో విషు సందర్భంగా 'కణి' దర్శనం ఆచారం కొనసాగుతోందని చెప్పారు. అస్సాం రాష్ట్రంలో బిహు, పశ్చిమ బెంగాల్‌లో పొయిలా బైశాఖ్ ఉత్సాహంగా నిర్వహిస్తారని తెలిపారు. ఇదే సమయంలో దేశంలోని మణిపూర్, త్రిపుర, ఒడిశా, బీహార్, ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుగుతాయని చెప్పారు. పవిత్ర గంగానదిలో స్నానం చేసేందుకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌కు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. ఇటీవల తెలుగు ప్రజలు ఉగాది, మరాఠీ మరియు కొంకణి సమాజాలు గుడి పడ్వాను జరుపుకున్నట్లు గుర్తు చేశారు. భారతదేశం అత్యంత ప్రాచీన నాగరికతకు నిలయమని, మన పూర్వీకుల శాస్త్రీయ జ్ఞానం నూతన సంవత్సర వేడుకల్లో ప్రతిబింబిస్తుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. తమిళ నూతన సంవత్సరమైన పుత్తాండు సంప్రదాయం, కుటుంబ విలువలు, ఆధ్యాత్మికత, క్రమశిక్షణను కలగలిపిన పండుగగా నిలుస్తుందని అన్నారు. తమిళ క్యాలెండర్‌లో సంవత్సరాలకు ప్రత్యేక పేర్లు ఉండటం విశిష్టతగా పేర్కొంటూ, 60 సంవత్సరాల చక్రంలో ప్రస్తుతం 'పరాభవ' సంవత్సరం కొనసాగుతోందని వివరించారు. పంచాంగ శ్రవణం ద్వారా వర్షపాతం, వ్యవసాయం వంటి అంశాలపై అంచనాలు వేయడం భారతీయుల పురాతన జ్ఞానానికి నిదర్శనమని తెలిపారు. సౌర, చంద్రమాన పద్ధతులను ఉపయోగించి కాల గణన చేయడం, గ్రహణాలను ఖచ్చితంగా అంచనా వేయడం వంటి విషయాలు మన పూర్వీకుల ప్రతిభను చాటుతున్నాయని చెప్పారు. ఈ జ్ఞానాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించడం మన బాధ్యతగా పేర్కొన్నారు. వసంత కాలం ప్రకృతి పునరుజ్జీవానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ సమయంలో చెట్లు పచ్చగా మారడం, పూలు వికసించడం, పండ్లు కాస్తాయనే అంశాలు జీవనోత్సాహాన్ని పెంచుతాయని చెప్పారు. తమిళ సంప్రదాయంలో 'కాణి' దర్శనం, అన్ని రుచులతో కూడిన వంటకం తయారు చేయడం జీవితం సుఖ-దుఃఖలతో నిండినదని తెలియజేస్తుందని వివరించారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా భారతీయులు నిర్వహించే ఈ పండుగలు సామరస్యానికి ప్రతీకలని, మనం కలసికట్టుగా జీవించాలనే భావనను బలపరుస్తాయని ఉపరాష్ట్రపతి తెలిపారు. యువత సానుకూల దృక్పథంతో, అంకిత భావంతో కొత్త సంవత్సరాన్ని ఆరంభించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి వికసిత భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తూ, "ఏక భారత్" స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సింగరేణి రక్షణకై హైదరాబాదుకు కదిలి రండి

## సిఐటియు నేత మంద నరసింహారావు

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 13(నేషనలిస్ట్ వాయిస్):**

సింగరేణి రక్షణకై ఈనెల 28న చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు పిలుపునిచ్చారు. కొత్తగూడెం మెయిన్ వర్క్ షాప్ లో బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జరిగిన పిట్ మీటింగ్ లో నరసింహారావు మాట్లాడుతూ సింగరేణికి రావాల్సిన 51 వేల కోట్ల బకాయిలకును రాబట్టేందుకు, ఓపెన్ కాస్ట్ లలో బొగ్గు తీసే పని సింగరేణి పర్మినెంట్ కార్మికులతో చేపట్టాలని, 40 సంవత్సరాలకు పైగా సింగరేణి కాపాడే ప్రాజెక్టు నైని బ్లాకులు ప్రైవేటు వారికి కాకుండా సింగరేణి కార్మికులతో బొగ్గు తీయాలని మంద నరసింహారావు పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యంని తగ్గించాలని తద్వారా సింగరేణి రక్షణ కొరకు ఈనెల 28న విద్యుత్ సౌదా ముట్టడి సెక్రటేరియట్ ముట్టడి ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సింగరేణి సంస్థను ఆర్థిక ఇబ్బందుల నుంచి రక్షించేందుకు కార్మికులందరూ కదిలి రావాలని ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, గాజుల రాజారావు, గడల నరసింహారావు, అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు భూక్య రమేష్, టౌన్ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# సమస్యలు పరిష్కరించాల్సిందే

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 13(నేషనలిస్ట్ వాయిస్):**

కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాల్సిందేనని బీఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కొరకు పాల్వంచ కేటీపీఎస్ వద్ద ఆర్టిజన్ కార్మికులు చేస్తున్న ఆందోళనకు సోమవారం బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికుల ఆందోళన ఉధృతం కాకముందే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లెల రవిచంద్రతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీలో అటెండెన్స్ అవకతవకలు...

**ఏప్రిల్ 13 నేషనలిస్ట్ వాయిస్**

ఏర్గట్ల : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అటెండెన్స్‌లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మేరకు నరేష్ అనే రిపోర్టర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పిర్యాదు ప్రకారం, పాఠశాలలో ఇంగ్లీష్ సి.ఆర్.టీగా పనిచేస్తున్న బి.లావణ్య 20 జనవరి 2025న విధుల్లో చేరినప్పటికీ, అటెండెన్స్ రిజిస్టర్‌లో 10 జనవరి నుంచే సంతకాలు నమోదయ్యాయని ఆరోపించారు. ఆ 10 రోజుల బిల్లులను ప్రాసెస్ చేసి సుమారు రూ.6,000ను ఫోన్‌పే ద్వారా ఎస్.ఓ సంధ్యకు పంపినట్లు కూడా పిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచిన అకౌంటెంట్ శాంతకు నైట్ డ్యూటీలు వేయకుండా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపించారు. ఇప్పటికే జనవరిలోనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా, జి.సి.డి.ఓ భాగ్యలక్ష్మి విచారణ చేపట్టినప్పటికీ అది నామమాత్రంగానే జరిగిందని పిర్యాదుదారు పేర్కొన్నారు. ఫిబ్రవరి, మార్చిలో లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అటెండెన్స్ నకలు పత్రాలు, ఆధార ధ్రువపత్రాలతో పాటు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఇచ్చిన లెటర్‌ను కూడా జతచేసి మరోసారి ఫిర్యాదు చేశారు. ఆ లెటర్‌లో లావణ్య జాయినింగ్ తేదీని 18 జనవరి గా పేర్కొన్నట్లు తెలిపారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.



